క్లుప్తంగా

వెంకన్నకు తోమాల సేవ


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ జరిగాయి. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. ప్రసాద వితరణ చేపట్టారు.

శ్మశానవాటిక రోడ్డు అభివృద్ధి చేయాలి


ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనుబాబు

సింహాచలం: అడవివరం శ్మశానవాటిక మార్గాన్ని అభివృద్ధి చేయాలని సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తిని దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. ఈ మేరకు శనివారం ఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. వరాహ పుష్కరిణికి ఆనుకుని ఉన్న శ్మశాన వాటికకు సరైన రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈవో స్పందిస్తూ మూడుచోట్ల అభివృద్ధి పనులు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. త్వరలోనే జీవీఎంసీ కమిషనర్‌తో చర్చిస్తామని ఈవో తెలిపారు.

కాయిన్స్ గేమ్ ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

సబ్బవరం:మండలంలోని అమృతపురం శివారు సూరెడ్డిపాలెం జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వద్ద కాయిన్ గేమ్ ఆడుతున్న ముగ్గురిని శనివారం సబ్బవరం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,400 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అభాగ్యునికి ఆశ్రయం


అభాగ్యుడిని తరలిస్తున్న వాసు

అల్లిపురం : దీనస్థితిలో ఉన్న అభాగ్యునికి భీమనగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం ప్రతినిధులు ఆశ్రయం కల్పించారు. పీఎం పాలెంలోని దిశ పోలీస్ స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి ఎప్పటి నుంచో దయనీయ స్థితిలో ప్లాస్టిక్ బ్యానర్ల కింద ఉంటున్నాడని ఆరిలోవ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ హరినారాయణ వసతి గృహానికి సమాచారం అందజేశారు. దీంతో గృహ ప్రతినిధి ప్రగడ వాసు తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. దుర్గంధంతో ఉన్న అతనికి స్నానం చేయించి బట్టలు మార్చి, భోజనం పెట్టి షెల్టర్‌కు తీసుకుకొచ్చారు. అతనికి సపర్యలు చేసిన తర్వాత అతని పేరు జోగులు రాంబాబు అని, తనది ఏలూరు అని చెప్పాడని తెలిపారు. అతనికి చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సత్కారం


డాక్టర్ భారతిని సత్కరిస్తున్న ఆస్పత్రి కమిటీ ప్రతినిధి రమణబాబు

అగనంపూడి: ఉత్తమ సేవలు అందిస్తున్న అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందించి గౌరవించడం సంతోషంగా ఉందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నక్కా రమణబాబు అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భారతిని కమిటీ ప్రతినిధులు శనివారం ఘనంగా సత్కరించారు.

తరలిన అభిమాన తరంగం

- సీఎం వైఎస్ జగన్ సభకు పెద్ద ఎత్తున పయనం
- వార్డులు, మండలాల నుంచి పోటెత్తిన అభిమాన తరంగం
- జగనన్నకు మద్దతుగా ఉంటామంటూ నినాదాలు


సంగివలస సభకు తరలివెళ్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు, కార్యకర్తలు


సిద్ధం సభకు తరలివెళ్లిన ముత్యాలమ్మపాలెం నాయకులు

పెందుర్తి: పేదవారు.. పెత్తందార్లకు మధ్య జరగనున్న ఎన్నికల సంగ్రామానికి సిద్ధం అని పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. జై జగన్ నినాదాలు హోరెత్తాయి. దారులన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న సంగివలస బహిరంగకు మళ్లాయి. నియోజకవర్గ నలుమూలల నుంచి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలివెళ్లారు.

- జీవీఎంసీ 95వ వార్డు నుంచి కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్యకర్తలు సభకు హాజరయ్యారు.
- ఎంపీపీ మధుపాడ నాగమణి ఆధ్వర్యంలో ఎస్‌ఆర్ పురం, సర్పంచ్ బొడ్డు చంద్రవతి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో వాలిమెరక నుంచి, గొరపల్లి శ్రీను ఆధ్వర్యంలో గొరపల్లి నుంచి, సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి జయరామ్ ఆధ్వర్యంలో పినగాడి నుంచి, సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష ఆధ్వర్యంలో రాంపురం నుంచి, సర్పంచ్ కేసుబోయిన లావణ్య త్రినాథ్ ఆధ్వర్యంలో పెదగాడి నుంచి, సర్పంచ్ కొయిలాడ శ్రీను ఆధ్వర్యంలో గవరపాలెం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.

ఎన్నికల సమరానికి సిద్ధమంటూ పెందుర్తి నియోజకవర్గం నుంచి జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తరలి వెళ్లింది. వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు వేలాదిగా కదలివెళ్లారు. జగనన్న వెనుక మేము న్నామంటూ నాయకులు, మహిళలు, కార్యకర్తలు ఆటోలు, బస్సుల్లో భీమిలి నియోజకవర్గం సంగివలసలో నిర్వహించిన ఎన్నికల శంఖారావం ప్రారంభ సభకు హాజరయ్యారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన జగనన్నను మరోసారి గెలిపిస్తామంటూ జైజగన్ నినాదాలతో హోరెత్తించారు. దారులన్నీ సంగివలస వైపే అన్నట్టు నియోజకవర్గంలోని పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాలు, వార్డుల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు జగనన్నకు మద్దతుగా బయలుదేరారు.

పరవాడ నుంచి...

పరవాడ: మండలం నలుమూలల నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంబహిరంగ సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పరవాడ, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, రావాడ, నాయుడుపాలెం, భర్నికం, తానాం, సాలాపువానిపాలెం, లంకెలపాలెం, మర్రిపాలెం, మంత్రిపాలెం, కన్నూరు, పెదముషిడివాడ, వెన్నలపాలెం, కలపాక, పి.బోనంగి, గొర్లివానిపాలెం, ఈ,బోనంగి, దేశపాత్రునిపాలెం గ్రామాల నుంచి బస్సులు, కార్లలో కదిలారు. ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయకులు చుక్క రామునాయుడు, వెన్నల సన్యాసిరావు, బండారు రామారావు, కోన రామారావు, కాసు అంజిరెడ్డి, పల్లా అప్పారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

98వ వార్డు నుంచి..

సింహాచలం: సంగివలసలో శనివారం జరిగిన ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు 98వవార్డు వైఎస్సార్‌సీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు లండ రమణ, లండ భాస్కర్, పాలూరి సూరిబాబు, వర్మ, శిడగం తాతాజీ పాల్గొన్నారు.


సంగివలస తరలివెళ్తున్న 98వవార్డు వైఎస్సార్‌సీపీ శ్రేణులు

విద్యార్థులకు బ్యాగ్‌ల వితరణ


విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేస్తున్న పీకే జోషి తదితరులు

సబ్బవరం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కన్‌సర్న్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.40 విలువ చేసే స్కూల్ బ్యాగులను శనివారం పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన సుమారు 70 మంది విద్యార్థులకు ఈ బ్యాగులను పాఠశాల హెచ్‌ఎం నాగమల్లేశ్వరరావుతో కలిసి ట్రస్ట్ చైర్మన్ పీకే జోషి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం పొందడం ద్వారా జీవనం సాగించగలం.. మనం ఇవ్వడం ద్వారా జీవితాన్ని ప్రసాదించగలం అనే స్ఫూర్తితో విద్యార్థులంతా ముందుకు సాగాలని కోరారు. ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే సహాయం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. దాని వల్ల జీవితానికి ఎంతో తృప్తి కలుగుతుందని తెలిపారు.

'ల్యాండ్ ఫిల్ ప్రతిపాదన విరమించుకోవాలి'

పరవాడ: తాడి గ్రామాన్ని ఆనుకొని నిర్మించాలనుకున్న ల్యాండ్ ఫిల్ ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. తాడి సమీపంలో చేపట్టిన ల్యాండ్ ఫిల్ నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. తాడి సర్వేనంబరు 116లో చేపట్టిన ల్యాండ్ ఫిల్ ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న వీవీజే గోపాల కృష్ణ తన తండ్రి జ్ఞాపకార్థం కళాశాలలో రూ.2.50 లక్షల విలువ చేసే ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.ఈ ప్లాంట్‌ను శనివారం కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్, పీఆర్‌ఎస్‌ఐ,హెచ్‌పీసీఎల్ చైర్లస్లు ఎం. కాళి, వీఎల్ నరసింహ ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలా భాస్కర్ మాట్లాడుతూ అధ్యాపకుడు గోపాలకృష్ణ తన తండ్రి, రిటైర్డ్ తహసీల్దార్‌గా పనిచేసిన సూర్యనారాయణ జ్ఞాపకార్థం కళాశాలలో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ ఆధునిక విద్య కోసం నిరంతరం సంసిద్ధులై మార్పులను గమనిస్తూ ఉండాలని సూచించారు. ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్‌లో జాతీయ స్థాయిలో జరిగిన స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో బంగారు పతకం సాధించిన కళాశాల విద్యార్థిని ఎన్. లలితా కామేశ్వరిని సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీవీఎస్ఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

8 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: మండంలోని మంత్రిపాలెం, మడకపాలెం గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలపై పోలీసులు శనివారం దాడులు జరిపారు. మడకపాలెంలో ఓ పాన్‌షాపుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 4 మద్యం (180ఎంఎల్) సీసాలు స్వాధీనం చేసుకుని కె.పైడిమ్మపై కేసు నమోదు చేశారు. అలాగే మంత్రిపాలెంలో కె.రాజుకు చెందిన పాన్‌షాపుపై దాడి చేసి 4 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసున మోదు చేసినట్టు ఎస్‌ఐ ఎస్.సురేష్ చెప్పారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా 'పరిచయ్'


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కిమ్స్ ఐకాన్ సీవోవో సుఖేష్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ కిమ్స్ ఐకాన్‌లో బొల్లినేని మెడ్ స్కిల్స్ పీజీ విద్యార్థుల పరిచయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కల్చరల్ ఫెస్ట్‌ను కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఆర్‌సీవోవో డాక్టర్ జి.బాలాజీ, సీవోవో జి.సుఖేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీవోవో మాట్లాడుతూ టైమ్ మేనేజ్‌మెంట్, ఆస్పత్రి రంగంలోని ఉపాధి అవకాశాలను విద్యార్థులకు వివరించారు. బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలలో నిర్వహిస్తున్న హెల్త్ కేర్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఏ, పీజీ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కిమ్స్ ఐకాన్ క్రిటికల్ కేర్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ హరి ప్రసాద్, డాక్టర్ రవి కృష్ణ, ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ చాణక్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

1080వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: మహోన్నతమైన భారత రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్వాతంత్ర్యానంతరం ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధి చేసుకున్న ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్‌వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న దీక్షలు శనివారానికి 1080వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్పందించి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

దేవాలయాలపై అధ్యయన వివరాలు నేడు వెల్లడి

వేదిక వైవీఎస్ మూర్తి ఆడిటోరియం

మహారాణిపేట : ప్రఖ్యాత సినీ గేయ రచయిత, తెలుగు వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు నేతృత్వంలో కొంత మంది భక్త చైతన్యవంతుల బృందం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల చరిత్రలను అధ్యయనం చేస్తోంది. పలు దేవాలయాల నిర్మాణం వెనుక పెద్దల కృషి, దాతల దాతృత్వం, దేవాలయాలకు సంక్రమించిన ఆస్తులు, వాటి నిర్వహణ తీరులో జరుగుతున్న అపచారాలు, కావాలని దేవాలయాల ఆస్తులను కొల్లగొడుతున్న తీరు తెన్నులు, కైంకర్యమైపోతున్న దేవాలయాల ఆస్తిపాస్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఈ బృందం తమ అధ్యయన విశేషాలను రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో సభలు ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేస్తోంది. ఈ పరంపరలో భాగంగా ఆదివారం సాయంత్రం మద్దిలపాలెం జంక్షన్ సమీపంలో గల డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఒక సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ పూర్వ ముఖ్య కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, విశిష్ట అతిథులుగా విజయ్ నిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయకుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రఖ్యాత పద్యకవి వామరాజు సత్యమూర్తి, అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృతాంధ్ర పండితులు పీటీజీవి రంగాచార్యులు, సాహితీవేత్త నేమాని మంజునాథ శర్మ, సీనియర్ జర్నలిస్టు జీవీఎస్ మూర్తి పాల్గొంటారు. సూరంపూడి వీరభద్రరావు సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ కార్యక్రమానికి పతంజలి యోగా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వేదభాస్కరం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఘట్టి శ్రీ విద్య బృందంచే భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అర్చకులు అంతా తరలి రావాలని ఉత్తరాంధ్ర అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తలంక మురళీకృష్ణ తెలిపారు.

ఆకట్టుకున్న టెక్ ఫెస్ట్


విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా శనివారం నిర్వహించిన టెక్ ఫెస్ట్, మోడల్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. సివిల్, సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, బీఎస్ అండ్ హెచ్ అన్ని సాంకేతిక విభాగాలు అనేక నమూనాలు ప్రదర్శించాయి. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ ప్రిన్సిపాల్‌తో ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈఈఈ విభాగం విద్యార్థులు తయారు చేసిన ఇంగ్లిష్ క్లాస్‌రూమ్, ఎలక్ట్రిక్ కార్‌ను ఆయన ప్రారంభించి అభినందించారు. నగరంలోని పలు పాఠశాలలు, ఇంటర్ కళాశాల విద్యార్థులు పాల్గొని నమూనాలు తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.

'పర్యావరణ హితంగా జీవించండి'



ఎకో వైజాగ్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు: 'పర్యావరణ హితంగా జీవించండి.. ప్రకృతి వనరులను కాపాడండి' అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా చిన్నవాల్తేరు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్లకార్డులను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తాము ఆరగించిన ఫలాల విత్తనాలను ఆరబెట్టి, వర్షాలు కురిసే సమయంలో కొండలపై,రహదారుల పక్కన చల్లాలన్నారు.

ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపు


ఈవో శ్రీనివాసమూర్తి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న సనపల నారాయణస్వామి

మర్రిపాలెం: శ్రీ సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య అందిస్తున్న సేవలను గుర్తించి, సింహాచలం దేవస్థానం వారు పురస్కారాలు అందజేశారు. 50వ వార్డు మాధవధారకు చెందిన సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య వ్యవస్థాపకుడు సనపల నారాయణ స్వామి అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలకు గానూ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రశంసా పత్రం, జ్ఞాపికను ఈవో శ్రీనివాస మూర్తి చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

ఈకార్వో వితరణ

రైల్వే హాస్పిటల్‌కు ఫొటోథెరపీ యూనిట్ అందజేత


ఫొటోథెరపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రతినిధులు, డాక్టర్ తిరు అరుళ్ జోతి

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే హాస్పిటల్‌కు ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో), వాల్తేర్ సభ్యులు నవజాత శిశువులకు ఉపయోగపడే పరికరాన్ని వితరణ చేశారు. రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(సీఎంఎస్) డాక్టర్ తిరు అరుళ్ జోతి సమక్షంలో దీనిని అందజేశారు. ప్రస్తుత కాలంలో నూతనంగా జన్మించిన శిశువులకు సర్వసాధారణంగా వచ్చే నియోనటల్ జాండిస్ నుంచి మొదటి వారంలో సంరక్షణ ఇచ్చేందుకు ఈ ఫొటోథెరపీ యూనిట్ ఉపకరిస్తుందని ఈకార్వో సభ్యులు తెలిపారు. దీని వల్ల ఇటువంటి వారిని వేరే ఆస్పత్రులకు తరలించాల్సిన అవసరం లేకుండా రైల్వే హాస్పటల్‌లోనే చికిత్సం అందించవచ్చన్నారు. ఈ హాస్పిటల్‌లో నెలకు సగటున 15–20 ప్రసవాలు జరుగుతున్నాయని, ఈ పరికరం వల్ల మరింత మంది పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఈకార్వో కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్ మధుస్మిత సాహూ, కవితా గుప్తా, ఈకార్వో ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి


సదస్సులో పాల్గొన్న మార్వాడీ సమాజ్ మహిళలు

అల్లిపురం : సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు అఖిల భారత మార్వాడీ సమాజ్ సంఘం కృషి చేస్తుందని సంఘం జాతీయ అధ్యక్షురాలు నీరు తెలిపారు. నగరంలో ఒక హోటల్లో శనివారం విశాఖ నగరంలోని మహారాష్ట్ర మండల్ నేషనల్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గ్రామస్థాయి నుంచి ప్రజలకు సామాజిక సేవ పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా ప్రతి ఏటా రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విశాఖ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా మార్వాడీ మహిళలు ఆటపాటలతో సందడి చేశారు.

విశాఖ ఉక్కు అమ్మకం నిర్ణయం విరమించుకోవాలి

దాబాగార్డెన్స్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిటు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను శతశాతం అమ్మాలని తప్పుడు నిర్ణయం తీసుకుందన్నారు. అప్పటి ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు సాగుతున్నాయన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం నేటికీ తన నిర్ణయాన్ని ఉపసంహరించలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాయని చెప్పారు. రాష్ట్రంలోని గనుల లీజులు పునరుద్ధరించకుండా కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. సముద్రతీరంలో ఉన్న ఏకైక భారీ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే దీనికి సరైన పరిష్కారంగా పేర్కొన్నారు. సమావేశంలో సిటు జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ సిటు ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి పాల్గొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్ట్

సబ్బవరం: మండంలోని ఎల్లుప్పి,నల్లరేగులపాలెం గ్రామాల్లో కోడి పందాలు ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని శనివారం కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఎల్లుప్పిలో కోడి పందాలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.400 స్వాధీనం చేసుకున్నారు. అలాగే నల్లరేగులపాలెంలో కోడిపందాలు ఆడుతున్న ఇద్దరి అరెస్టు చేయడంతో పాటు రెండు కోడి పుంజులు,రూ.400 నగదు స్వాధీనం చేసుకున్నారు.